# జమా ఖర్చులు - వడ్డీకాసులు

- అనూరాధ

అక్షరాల మీద వున్న ప్రేమలో వందో వంతు కూడా అంకెల మీద లేదు నాకు. పైగా వరసగా అన్ని అంకెలు ఓ చోట చూస్తే కళ్లు తిరుగుతాయి కూడాను. అందుకే ఈమధ్య మావారు తత్సంబంధమైన తర్జనభర్జనలతో సతమతమవుతున్నా ఎరగనట్టు ఊరుకున్నాను. కానీ తలరాత తప్పదు కదా!

వన్ ఫైన్ మార్నింగ్ పేపరు చూస్తూనే మావారు ఆర్తనాదం లాంటిది చేసి నన్ను పిలిచారు.

నేను వస్తూండగానే 'చూడు వడ్డీరేటు ఇంకా పడిపోయింది. ఫైవ్ పర్సెంటుట' అన్నారు దీనంగా.

ఏదో పేషెంట్ పల్స్ పడిపోయినట్టు అంత గాభరా ఎందుకో నాకు అర్థం కాలేదు. అంచేత ఈ వడ్డీరేటు పడిపోవడం అన్నది మా సంసారంపై ఏ స్థాయిలో ప్రభావం చూపిస్తుందో నేనూహించలేకపోయాను.

కానీ మావారికి దూరదృష్టి చాలా ఎక్కువ కదా, అందుకని ప్రమాద హెచ్చరిక ఇలా మొదలుపెట్టారు.

'ఏం చెయ్యాలో తోచక నేను బుర్ర బద్దలు కొట్టుకుఛస్తుంటే, నీకు చీమ కుట్టినట్టు కూడా లేదు. ఏవిటనేనా అడగవు'

'అడిగి తెలుసుకునేంత ఇంట్రెస్టు నాకు లేదు కదండీ. ఒకవేళ మీరు నన్ను కూచోబెట్టి చెప్పినా నాకు అర్థం అవదు'.

'చూడమ్మడూ, నీకు ఇంట్రెస్టు లేకపోయినా తెలుసుకోక తప్పదు. బ్యాంకు డిపాజిట్ల మీద వచ్చే ఇంట్రెస్టు దారుణంగా పడిపోయింది. దాంతో మనకి వచ్చే మంత్లీ ఇన్‌కం తగ్గిపోతుంది. ఆ మేరకు నువ్వు ఖర్చులు తగ్గించుకోవాలి'

'బావుంది. తగ్గించుకుందుకు అసలు నాకు పర్సనల్ ఖర్చులేమున్నాయి? మీరిచ్చిందంతా ఇంటికోసమే అవుతోంది'

'పోనీ ఆ ఖర్చులే అనుకో. ఇల్లే నువ్వు, నువ్వే ఇల్లు కనక అలా అన్నాను కానీ నాకు మాత్రం తెలీదా, అన్నీ ఆ ఖాతాలోనే జమవుతాయని...'

'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అన్నారు కదా అలా, ఊc చెప్పండి'

'ఇన్‌కం పడిపోయినప్పుడు ఎక్స్‌పెండిచర్ కట్ చెయ్యడం తప్ప మార్గం లేదు'

'నీకు ఎప్పుడూ ఇచ్చే దాంట్లో ట్వంటీ ఫైవ్ పర్సెంట్ తగ్గించి ఇస్తాను. అలా అయితే అసలుకి ఎసరు రాదు'

'ఆ పర్సెంటేజీలు నాకు తెలీవు కానీ ఎప్పుడూ ఇచ్చే దానికన్నా వంద రూపాయలు తగ్గినా నేను మేనేజ్ చెయ్యలేను. అన్ని ధరలూ పోటీపడి మరీ పెరిగిపోతున్నాయి.

'నిజమే. కానీ ధరలు పెరిగినప్పుడల్లా డి.ఎ. పెరగడానికి నేనేం సర్వీసులో వున్నానా? వచ్చే పెన్షన్‌తో గడుపుకోవాలి'

'ఎలా గడుస్తుంది? ఏ ఖర్చు తగ్గించమంటారు?'

'అలా అనే జీతం వచ్చినన్నాళ్లూ ఇచ్చినన్ని అప్పులూ తీసుకున్నాం. గ్రాస్ కొండంత. నెట్ గోరంత. ఇంక ఇప్పుడా పప్పులుడకవు. వచ్చిన వడ్డీతోనూ, పెన్షన్‌తోనూ సరిపెట్టుకోలేక ఎఫ్.డి.ఆర్. మీద లోన్ తీసుకుంటే తీర్చే మార్గం లేదు. ఇది అక్టోబరు కదా. జనవరినించీ జాగ్రత్తగా వుండాలి. ఈ మూణ్ణెల్లూ ఆలోచించుకుని ప్రాక్టికల్‌గా చూసుకుని ప్లాన్ చేసుకో'.

'మీరు ఇవ్వావద్దు, నేను తీసుకోనూ వద్దు. ఏం తగ్గించుకుంటారో, పెంచుకుంటారో మీ ఇష్టం. కావల్సినవి చెప్తాను. తెచ్చి పడేయండి. డబ్బు గోల, జోలి నాకు వద్దు'

'ఇప్పుడే ఇలా అంటున్నావు. ఫుల్ పెన్షన్ వస్తున్నప్పుడే చేతకాకపోతే కొన్నాళ్లుపోతే ఫ్యామిలీ పెన్షన్ మాత్రమే వస్తే ఏం చేస్తావు? అన్నిటికీ ప్రిపేరై వుండాలి'

ఇంకేం మాట్లాడను?

◆ ◆ ◆

ఇలా నాకు మూణ్ణెల్ల నోటీసు ఇచ్చేసి మావారు నిశ్చింతగా తన ధోరణిలో తనున్నారు.

ప్రజల కష్టార్జితం గుటకాయస్వాహా చేసే బ్యాంకుల్నీ, కంపెనీల్నీ, అసలుకి కొసరుగా రవ్వంత వడ్డీ విదిల్చే బ్యాంకుల్నీ నిశ్చింతగా, నిష్పక్షపాతంగా విమర్శిస్తున్నారు.

'డిపాజిట్లు- వాటి భద్రత ఎక్కడెక్కడ ఎంతెంత శాతం వడ్డీలు ఇస్తున్నారు' అనే అంశం మీద అందుబాటులో వున్న వాళ్లందరితోనూ చర్చిస్తున్నారు. ఎవరి స్థాయికి తగ్గట్టు వారితో చర్చలు జరుపుతున్నారు.

విసుగూ, విరామం లేదు. సలహాలు ఇస్తున్నారు. స్వీకరిస్తున్నారు. విస్తృతంగా విషయ సేకరణ చేస్తున్నారు.

నాకే ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. దిక్కుతోచకుండా వుంది. ఇంకా మూణ్ణెల్లు టైముంది కదా ఈలోపల ఏవైనా కథలూ, కార్యాలూ జరిపిస్తే నాలుగు రాళ్లు మిగులుతాయి కదా అనుకుంటే అలాంటి అవకాశాలేం లేవు. పండుగలని మొదటే తీసిపారేశారు.

'మనకేం ఫెస్టివల్ అడ్వాన్సులుండవు. ఇంక పండగలేవిటి? నీ మొహం!' అంటూ పనిలో పనిగా 'ఎవరికీ అడ్వాన్సులివ్వకు. జీతంలో కట్ చేసుకుంటానంటూ' అని హెచ్చరించారు.

ఇంటికి రిపేర్లు, పెయింటింగ్ లాంటివి ఆర్నెల్ల క్రితమే అయ్యాయి. ఆ ఛాన్సు లేదు.

చిన్నపిల్లలకి తప్ప పెద్దవాళ్లు పుట్టినరోజులు చేసుకోవడం నాకు నచ్చదు. ఇంక పెళ్లిరోజు. పెళ్లీ, అనంతమైన దాని అనంతర పరిణామాలూ అనుక్షణం అనుభవిస్తూనే వుంటాం కదా. అది చాలదన్నట్టు ఏడాదికోసారి తడువుకుని తలచుకుని బావుకునేదేవుంది? అందుకని ఆ ఉత్సవమూ లేదు. మావారు రిటైరై ఏడాది అయిపోతోంది కదా! యానివర్సరీ ఘనంగా చేద్దామా అనిపించింది కానీ తీరా ఆలోచిస్తే అందులో అంత సబబున్నట్టు తోచలేదు. పోనీ పాత బాకీలేవన్నా సృష్టించి, కొంత మొత్తం సేకరిద్దామా అంటే అదీ అసాధ్యమే. ఆ ఉపాయం మొన్ననే పన్నాను. గద్వాల్ చీరల సేల్ పెట్టినప్పుడు

## ఆవేదనల ఆవిష్కరణలకు!

నేనూ-
లోలకమూ-
ఊగి సాగి రెండు కొసలకు
జరిగి ఒరిగి రెండు దెసలకు
భూమిని ఎత్తి మొయిలను దించి
లయబద్ధమైన బాధలకు
ఆవేదనల ఆవిష్కరణలకు
నాలోనే కాలం స్తంభించినప్పుడు
ఆర్తితో, కసిగా, దయతో
తిరిగి కొసలకు-ఎత్తు పల్లాలకు
మూలాల నుండి అవతలికి
మూడు కళ్ళతో ముళ్ళ బతుకులకు
అణువణువునా కొలతలకు
లోలకమూ- నేనూ
చోటు లేని తావులకు
దారితెగని తీరాలకు
లక్షోపలక్షల ఘటనలకు
తేలిపోయే జనన మరణాలకు
గంటలై మ్రోగే హెచ్చరికలకు
నేనూ- లోలకమూ
ఎప్పటికీ ఆగిపోని శ్వాసలకు
విశ్వాసాలకతీతమైన సూత్రాలకు
మౌనంలోకి చే(జా)రిపోయే చర్చలకు
అవగతమయ్యే మార్మికతలకు
యదార్థమే కాని యథార్థాలకు
విస్ఫోటనాలకు-విలయాలకు
లోలకమూ-
నేనూ!

-వేణూ సంకోజు

ఇంకో మార్గం లేకపోయింది.

ఇంక సరే, ముక్కుకు సూటిగా వెళ్లి ఆదాయం పెంచే విధానం గురించి ఆలోచిస్తుంటే ఓ ఐడియా వచ్చింది.

ఆయనతో చెప్పాను.

'పిల్లలు వస్తే ఇల్లు సరిపోతుందా?'

'నాకు గొడవా, గందరగోళం గిట్టవు తెలుసుగా. ప్రశాంతంగా వుండాలి.'

'ఉత్తరోత్తరా కొత్త సమస్యలూ చిక్కులూ వస్తాయేమో చూసుకో. నీదే బాధ్యత.'

ఇలా సందేహాలూ, హెచ్చరికలూ, సూచనలూ రూపంలో ఆయన అభిప్రాయాలు వ్యక్తీకరించి తప్పుకున్నారు.

కానీ నాకు తప్పదు కదా!

అందుకని కొత్త బరువు నెత్తికెత్తుకున్నాను.

అలా మా ఇంట్లో రెండు గదుల్లో అద్దెకు దిగింది చూడామణి.

ఆవిడకు మగవాళ్లంటే గిట్టదు. సదభిప్రాయం లేదు. స్త్రీల తను, ధన, మాన ప్రాణాలన్నీ హరించేందుకే పురుషులు కాసుక్కూచుంటారని ఆవిడ దృఢ విశ్వాసం.

అందుకే పెళ్లి చేసుకోలేదు.

ఉద్యోగస్తురాలు. పగలల్లా ఇంట్లో వుండదు. ఒంటరి మనిషి. ఏ బాదరబందీ లేదు. ఆవిడకీ సౌకర్యంగానే వుంది. మాకూ ఇబ్బంది లేదు.

కొంతమేరకు తాత్కాలికంగా నేనా బడ్జెట్ లోటు పూడ్చగలిగాను కదా అని తృప్తిపడ్డాను. అందుకే ఆ ప్రౌఢ కన్య నన్ను ఆంటీ అని, మావారిని అంకుల్ అని పిలుస్తున్నా సహిస్తున్నాను.

◆ ◆ ◆

ఉన్నట్టుండి మా అమ్మక్కయ్య కూతురు సుజాత దిగింది.

అది నాకంటే నాలుగేళ్లు చిన్నది. కానీ పదేళ్లు పెద్దదానిలా ప్రవర్తిస్తుంది. కాళ్లు కడుక్కుని కాఫీ తాగుతూనే ఇల్లంతా ఏరియల్ సర్వే చేసేసింది.

'ఆ రెండు గదులూ ఎవరికో ఇచ్చినట్టున్నారు. ఇరుగ్గా లేదూ' అని ముక్కు చిట్లించింది.

'కొత్త వస్తువులేం కొన్నట్టు లేదే?' అని అసంతృప్తి ప్రకటించింది.

'ఉన్నవి అమ్ముకోకుండా వుంటే కొత్తవి కొనుక్కున్నంత పుణ్యం' అన్నారు మావారు.

ఆయన కంఠంలో ధ్వనించిన నిరాశా నిస్పృహలు కనిపెట్టి, 'అదేవిటండీ బావగారూ, అలా అంటారూ' అని కుతూహలం చూపెట్టింది.

మావారికి పూనకం వచ్చేసింది.

ఇంక ఆపటం ఎవరి తరం?

మా కుటుంబ ఆర్థిక స్థితిగతులు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు దానికి వివరించారు. భవిష్యత్తులో మేం ఎదుర్కోవలసిన గడ్డుకాలాన్ని కళ్లకి కట్టినట్టు చూపించారు.

ఆ ప్రదర్శన అయ్యాక మావారు సుష్టుగా భోంచేసి సుఖనిద్రకి ఉపక్రమించారు. అంతవరకూ అతికష్టం మీద ఉగ్గబట్టుకుని ఇంక ఆగలేక సుజాత అందుకుంది.



'అదేవిటే అక్కా! ఇంత వెర్రిబాగుల్దానివేవిటే నువ్వు. ముప్ఫై మూడేళ్లనించీ సంసార చక్రం తిప్పుతున్నావు. ఇంకా నీ జమా ఖర్చులు మొగుడి చేతిలో వుండటవా? ముగ్గురు పిల్లల తల్లివి, నలుగురు మనవల్నెత్తావు. నిన్ను పట్టుకుని 'ఇంతే ఇస్తాను. ఇంతలోనే ఇల్లు గడుపు' అని బావగారు అనడం, 'చిత్తం, చిత్తం' అంటూ నువ్వు అగ్గగ్గలాడిపోవడం ఎవరైనా వింటే సిగ్గుచేటు కూడాను' అంటూ.

నాకు వల్లమాలిన ఉక్రోషం వచ్చింది.

'ఒసే సుజాతా, నీలా తలకాయలు మార్చేంత దేవాంతకపు బుర్ర కాకపోయినా ఏదో సంసారపక్షమైన తెలివితేటలు నాకూ ఉన్నాయే. పెద్ద ఖర్చులు తగిలినప్పుడు వీలైనంత వెనకేస్తాను. ఇప్పుడు ఇల్లు అద్దెకిచ్చానా, ఆయనతో ఆరొందలని చెప్పాను. ఎనిమిదొందలు పుచ్చుకుంటున్నాను. ప్రతినెలా ఆయన ఇంటి ఖర్చు కిచ్చిందంతా వాడేసి కడిగి బోర్లించేస్తున్నాననుకున్నావా. పాతిక వేల చీటీ వేస్తున్నాను.'

'చాల్లేవే, నువ్వూ నీ సత్తెకాలవూనూ. అదేదో పెద్ద ఘనకార్యంలా చెప్తున్నావు కూడాను. నెలకి నాలుగొందలో, అయిదొందలో తన ఖర్చుకి వుంచుకుని మిగిలిన సంపాదన అంతా నీ చేతిలో పొయ్యాలి బావగారు– అదీ నీ ప్రయోజకత్వం. ఎంద దాచాలో, ఎక్కడ దాచాలో, ఎంత ఖర్చుపెట్టాలో, ఎలా ఖర్చుపెట్టాలో అదంతా నీ ఇష్టం. మిగులో, తగులో ఆ బాధలన్నీ నువ్వు పడతావు. అంతేకానీ భరణం ఇచ్చినట్టు ఇదేవిటే? నేనైతే ఇలాంటి సంసారం ఒక్క రోజు

చెయ్యలేను.'

'ఏడిశావులే, కోతలు కొయ్యకు...'

'కోతలు కాదే అక్కా! నిజంగానే, మావారి గ్రాస్ ఎంతో, నెట్ ఎంతో, బేసిక్ ఎంతో, డి.ఎ. ఎంతో, ఏ అలవెన్సులు ఎంతో నిద్దట్లో లేపి అడిగినా నేను చెప్తాను. ఇంక్రిమెంట్ డ్యూ ఏ నెల్లోనో, డి.ఎ. ఎన్నిసార్లు, ఎన్ని శ్లాబులు పెరుగుతుందో నాకు ఖచ్చితంగా తెలుసు. ఏ సందర్భంలో ఏ అడ్వాన్సు తీసుకోవచ్చో, ఇంట్రెస్ట్ ఫ్రీ అడ్వాన్స్‌లేవిటీ, మిగిలిన వాటికి ఇంట్రెస్ట్ ఎంత పర్సెంట్, ఎన్ని ఇన్‌స్టాల్‌మెంట్స్ ఫిక్స్ చేస్తారు. అన్నీ నాకు కొట్టినపిండి. టాక్స్ లెక్కలు మా ఆడిటరు గారితో సమంగా కట్టగలను.

అసలీ లావాదేవీలన్నీ చూసిపెడుతున్నందుకు మావారే నాకు నెలకింత అని పే చెయ్యాలి. పోనీలే అని వదిలేశాను...' సుజాత అలా చెప్తూనే వుంది.

'వాములు మింగే స్వాములుకి పచ్చగడ్డి ఫలహారం' అని దాని ప్రతిభాపాటవాల ముందు నా చిట్కాలేపాటి అని మాట్లాడకూరుకున్నాను.

సరే, అది వెళ్లేటప్పుడు చీరే, రెవికా, పండూ, తాంబూలం పుచ్చుకుని మా ఇద్దరి కాళ్లకీ దణ్ణపెట్టి నన్ను అసింటా తీసికెళ్లి మళ్లీ మొదలెట్టింది.

'అక్కా! ఇంకో ముఖ్యమైన విషయవే్, నువ్వు ఎప్పుడూ విధేయురాలు, చరణదాని అన్నట్టుంటావెందుకు? 'ఎక్కడే పని కనపడుతుందా, చేద్దావా' అని అలా అల్లుకుపోతావేం? ఓపిక లేదనీ, టైమ్ లేదనీ సగం పనులు ఎప్పుడూ పెండింగ్‌లో వుంచాలి. అలిసిపోయినట్టు, హడావిడిగా కాళ్లూ, చేతులూ విరగ్గొట్టుకుంటున్నట్టు వుండాలి కానీ అలా అందరికీ అందుబాటులో వుండకూడదే ఎప్పుడూను.

ఇంట్లో మారు విస్తరి వెయ్యాల్సి వచ్చినా, మరో గ్లాసు కాఫీ అడగాల్సి వచ్చినా 'ఏవనుకుంటుందో ఏమిటో, చెయ్యగలదో లేదో అని ఒకటికి రెండుసార్లు ఆలోచించే స్థితిలో మొగుణ్ణి వుంచాలి కానీ...'

'సరేలేవే, సరే వెళ్లగానే ఫోన్ చెయ్యి. అందర్నీ అడిగానని చెప్పు'. ఇలా మొదటి నెల అయిపోయింది. రెండో నెల జరుగుతోంది.

◆ ◆ ◆

నాకు రాత్రీ పగలూ ఒకటే దిగులు.

డబ్బు ఎలా సరిపెట్టాలా అని.

పెరట్లో ఆకుకూరలు, కూరగాయల పెంపకం చేపట్టాను. ప్రకృతి సహకరించలేదు. టూత్‌పేస్టులు, సబ్బులు వీటికి చాలా భాగం కేటాయించాల్సి వస్తోంది కదా అని వాషింగ్ పౌడరు, టూత్ పౌడరు, సబ్బులు వీటి తయారీ మొదలుపెట్టాను. కానీ నా ఉత్పత్తులు వినియోగించేందుకు మావారు అంగీకరించకపోగా హాహాకారాలు చేశారు.

తెలుగు, ఇంగ్లీషు రెండు పేపర్లెందుకు? ఒకటి చాలదా?' అంటే 'ససేమిరా' అన్నారు. ఇంగ్లీషు పేపరు దళసరిగా వుంటుంది. అలమార్లలో వేసుకుందుకు బావుంటుంది కదా అని ఊరుకున్నాను.

సరే, డైటీషియన్స్ అందరూ ఒళ్లు వరసన ఇదౌతున్నారు కదా అని నెయ్యి పూర్తిగా మానేసి నూనె వాడకం సగానికి సగం తగ్గించాను.

పాల తలసరి వాడకం రోజుకి పావు లీటరుకి ఎక్కువా, అరలీటరుకి తక్కువా చేశాను. పాల ఉత్పత్తులు అసలే లేవు. కాఫీ మానేసి, టీ ఆరంభించాను. జీడిపప్పులు, బాదంపప్పులు, డేట్సు లాంటి డ్రైఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు పూర్తిగా నిషేధించాను.

సాదా అరటిపళ్లూ, బొప్పాయి, జామ వంటి దేశవాళీ ఫలజాతులు మాత్రమే కొంటున్నాను.

ఈ ధోరణి కొంచెం ఆశాజనకంగా వున్నట్టు కనిపిస్తోంది.

ఈ నిబంధనలు ఆరోగ్య సూత్రాలకు అనుసంధించిన కారణంగా మావారు అభ్యంతరం చెప్పలేకపోతున్నారు.

కానీ క్రమంగా నాకే జీవితేచ్ఛ నశించి నిర్వాణపథం వైపు అడుగులేస్తున్నట్టు తోస్తోంది. ఇలా దీక్షగా, యజ్ఞంలా ఈ ప్రణాళిక కొనసాగిస్తే మిగిలిన అవసరాలెలాగూ తగ్గుముఖం పడ్తాయి. ఆహార విషయంలో మాత్రం

'ఫల రసాదులు కురియవె పాదపములు<br>స్వాదు జలముల నుండవె సకల నదులు<br>పొసగ భిక్షయు పెట్టరె పుణ్యసతులు...'

అనే అత్యున్నత స్థితికి అతి త్వరలో చేరుకోగలవనే విశ్వాసం కుదిరింది.

◆ ◆ ◆

ఓ ఆదివారం పొద్దున్నే 'గుడ్‌మార్నింగ్ ఆంటీ' అంటూ వచ్చింది చూడామణి. 'ఓ అరగంట మీతో మాట్లాడాలి. మీకు వీలవుతుందా ఆంటీ' అని అడిగింది.

'సరే'నన్నాడు.

'స్త్రీలు- ఆర్థిక స్వావలంబన' అని ఓ ఆర్టికల్ రాస్తున్నాను. గృహిణుల్నీ, ఉద్యోగినుల్నీ అందర్నీ ఇంటర్వ్యూ చేస్తున్నానాంటీ. మీరు కూడా మీ అభిప్రాయాలు ధైర్యంగా, స్పష్టంగా చెప్పాలి'.

'అలాంటి అవకాశం రావాలే కానీ ఢంకా మీద దెబ్బకొట్టి మరీ చెప్తాను. అడగండి.'

'నిన్నటి తరం వరకూ మధ్యతరగతి స్త్రీలు తమ శక్తియుక్తుల్నీ, శ్రమనీ కేవలం కుటుంబం కోసమే ఉపయోగించారు.

మగవాళ్లను మించి మోట పనులూ, బండ పనులూ చేశారు.

రోకళ్లతో దంచడం, తిరగలితో విసరడం, మట్టీ పేడా పెట్టి లంకంత కొంపలు అలకడం, బిందెలకొద్దీ నీళ్లు మొయ్యడం, కుంచాలకొద్దీ వండి వార్చడం... ఇవన్నీ వాళ్లు కుటుంబానికి చేసే సాధారణ సేవలు మాత్రమే. వీటివల్ల ఆ స్త్రీలకు ఎటువంటి ఆర్థిక లాభం వుండేది కాదు. కనీస అవసరాలు తీరేవి. ఒంట్లో శక్తి వున్నంతకాలం ఇలా చెయ్యడం తరవాత ఇంకో ఆడదానికి ఆ పనులన్నీ అప్పగించడం అదీ వాళ్ల జీవితం.

ఇప్పుడు పని పద్ధతి మారింది. యంత్రాలు వచ్చాయి. ఇంటి నిర్వహణతోపాటు సంపాయించే భారం కూడా ఆడదాని మీద పడింది. పని రెట్టింపు అయింది. ఇంటా, బయటా కూడా వత్తిడి ఎక్కువైంది.

దీనిని స్త్రీకి లభించిన ఆర్థిక స్వేచ్ఛ అనాలా, ఆమె నెత్తిన పడిన అదనపు బరువు అనాలా? సంపాదించే భార్య పట్ల భర్త ధోరణి ఎలా వుంటోంది, ఎలా వుండాలి?'

నాకు పరమానందమైంది.

'దాందేం వుందండీ. నీ జీతం నీ ఇష్టం. అంతేకాదు, నా జీతం కూడా నీ ఇష్టమే' అని మనస్ఫూర్తిగా అనగలిగినవాడూ, ఆచరించగలిగినవాడూ ఉత్తమ భర్త.

'నీ అవసరాలూ, ఆడంబరాలూ, సరదాలూ, మర్యాదలూ అన్నీ నీ జీతంలోంచే తీర్చుకో. నా జోలికి రాకు' అనేవాడు మధ్యముడు.

ఫస్టు తారీఖున పెళ్లాం జీతం కోసం కాపలా కాసి, ఒక్క రూపాయి తక్కువైనా తన్ని, మరీ లాక్కునేవాడు అధముడు.

'అంటే, కాస్త వివరంగా చెప్పండి.'

'ఏం లేదు. కేవలం తన కష్టార్జితం తనకు దక్కుతున్నంత మాత్రాన ఏ స్త్రీ ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నట్టు కాదు. కేవలం ఆ నామమాత్రపు స్వేచ్ఛతో ఆమె తృప్తీ, సంతోషం పొందలేదు. భర్త సంపాదనని రెండు చేతులా ఖర్చుపెట్టగలిగినపుడే ఆ స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ వచ్చినట్టు.'

'ఆ రకమైన స్వేచ్ఛ మీకు లభించిందా?'

'ఇంకా లేదు. అది నా కల, లక్ష్యం, గమ్యం.'

'అయితే మీ గమ్యాన్ని చేరుకోవడానికి, మీ లక్ష్యం సాధించడానికి, మీ కల సాకారం చేసుకోవడానికి మీరేం కృషి చేస్తున్నారు? చెప్పగలరా?'

'నేనే కాదు చూడామణి గారూ, ఏ గృహిణీ మీకు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పదు. ఎందుకంటే, విభిన్న మార్గాలు, ఎవరి పద్ధతులు వాళ్లవి. ప్యూర్లీ పర్సనల్.'

'పోనీ నా తెలివితేటలన్నీ సంసారంలో పడి వృథా అయిపోతున్నాయి. ఉద్యోగం చేసివుంటే ఎంత బావుండేదో' అని మీకెప్పుడైనా అనిపించిందా ఆంటీ?'

'లేదు లేదు. ఎప్పుడూ ఎంత మాత్రం అనిపించలేదు. ఎందుకంటే ఇప్పుడు మావారి జీతంలో కొంత భాగానికి మాత్రమే నేను లెక్కచేస్తే సరిపోతోంది. అప్పుడు నా పూర్తి సంపాదనకు కూడా నేను లెక్కలు తయారు చెయ్యాల్సి వచ్చేది. అది నా శక్తికి మించిన పని.'

'అయితే మీవారు ఏ కేటగిరిలోకి వస్తారు? ఉత్తముడా, మధ్యముడా?'

'ఆగండాగండి! అంతటితో ఆగండి. పాపం మొదటి రెండు తరగతులే అటూ ఇటూ మారుతూ వుంటారు. స్థిరంగా ఒకచోట ఉండరు.'

నా జవాబు చూడామణికి నచ్చినట్టు లేదు.

'వస్తానాంటీ, థాంక్స్' అని నీరసంగా లేచి వెళ్లింది.

◆ ◆ ◆

రోజులు గడుస్తున్నాయి.

రోజూ చారూ, అన్నం తింటున్నా కూడా జీవితం రసహీనంగా తోస్తోంది.

ఓ విందు లేదు. వినోదం లేదు.

షాపింగ్ లేదు. సరదా లేదు.

దిక్కుమాలిన లెక్కల బతుకు. ప్రాణం విసిగిపోతోంది. కాళ్లూ చేతులూ కట్టేసినట్టుంది.

ఆ ముక్కే చూడామణితో అన్నాను.

'అదే ఆంటీ, నేననేదీను. మీ డబ్బు మీకు వేరే వుంటే మీకిలాంటి పరిస్థితి వచ్చేదా? దర్జాగా ఖర్చు పెట్టుకునేవారు.'

'నాకంటూ వేరే లేకపోతే ఏం ఇన్నాళ్లూ దర్జాగానే ఖర్చు పెట్టాను. ఆ అలవాటు కొద్దీనే ఇప్పుడీ బాధ.'

'ఎలా ఖర్చుపెట్టారు. మీవారు దయదలిచి ఇచ్చారు గనక.'

'ఇవ్వకపోవడంలో ఆయనకేం దురుద్దేశం లేదండీ. దూరదృష్టే కానీ.'

'దూరదృష్టీ కాదు, దివ్యదృష్టీ కాదు. పడగ విప్పిన పురుషాహంకారం.

'ఇలా చెయ్యి' అని ఆర్డరేశారు కానీ 'ఏం చేద్దాం' అని మిమ్మల్ని సలహా అడిగారా? 'ఎలా చేస్తే బావుంటుంది' అని సంప్రదించారా? తన నిర్ణయం మీరు అమలు జరపాలి. అవస్థ పడినా సరే. నో అదర్ ఆల్టర్నేటివ్.

అసలు ఇన్వెస్ట్‌మెంట్ ఇష్యూలో కానీ, సేవింగ్స్‌లో కానీ ఆయనెప్పుడైనా మిమ్మల్ని కన్సల్ట్ చేశారా?

ఆవుని బాగా పొడుగాటి తాడుతో గుంజకు కట్టేస్తే ఆ ఆవరణలోనే తిరుగుతూ 'ఆహాఁ నాకెంత స్వేచ్ఛ' అనుకుంటుందిట. అలాగ, తిండీ తిప్పలూ, చాకిరీ, పనిమనిషీ, బంధువులూ లాంటి తలనెప్పి వ్యవహారం మీకొదిలేస్తే మీకేదో మహా సామ్రాజ్యాధిపత్యం కట్టబెట్టినట్టు మీరు మురిసిపోతున్నారు.'

'డబ్బు విషయాలు నేనడగక్కర్లేకుండానే ఆయన అన్నీ చెప్తారు. నాకే ఇంట్రెస్టు లేక వినను. ఇంటి వ్యవహారం ఆయనకి విసుగు. అప్పులూ, అరువులూ, పర్చేజ్, ఎక్స్చేంజ్ ఇవన్నీ ఆయనకి చిరాకు.'

'అవును. ఇంత చదువూ చదివి మీరు వంటింట్లో మగ్గిపోవడం వల్ల వచ్చిన చిక్కు ఇదంతా. మీరూ ఉద్యోగం చేస్తే ఆ లెక్కలూ, డొక్కలూ మీకూ అలవాటయ్యేవి.'

నా సమస్య తీరకపోగా పనికిమాలిన ఆలోచనలన్నీ పట్టుకునేలా వున్నాయని లేచ్చక్కా వచ్చేశాను.

◆ ◆ ◆

మూడో నెల కూడా ముగింపుకు వచ్చేస్తోంది.

నా సహనం సంపూర్ణంగా చచ్చిపోయింది.

'ఉరుకులూ, పరుగులూ, ఫ్రస్ట్రేషన్, టెన్షన్ వీటితోటో ఇన్నాళ్ల బతుకూ గడిచింది. సాయంకాలమైంది. బరువులూ, బాధ్యతలూ తీరి రిలాక్స్‌డ్‌గా రోజులు గడపాల్సిన ఈ వయసులో డబ్బు చిరాకులేవిటి?' అని ఒళ్లు మండిపోతోంది.

'కాలం నాడు ఏ రాజభోగాలననుభవించేశావని ఇప్పుడీ కటకట!

వృద్ధాప్యంలో 'కృష్ణా! రామా!' అనుకుంటూ సుఖపడటానికే కదా వయసులో శ్రమించి కూడబెట్టేది. అలా కడుపు కట్టుకుని కూడబెట్టడమే నేరమైపోయింది. చాలీచాలని ఈ వడ్డీ డబ్బుల కోసమేనా ఇన్నాళ్ల పొదుపు'– ఇలా నాలో నేను గింజుకోవడం అయ్యాక ఇవన్నీ నిర్మొహమాటంగా ఆయన్నే అడిగేశాను.

'ఇంట్రెస్టు రేట్లు ఇంత దారుణంగా పడిపోతాయని నేను మాత్రం ఊహించానేవిటి?' అని ఖస్సుమన్నారు.

'కీడెంచి మేలెంచమన్నారు, అన్నిట్లో వుండే లాభనష్టాలు, కష్టసుఖాలు ఆలోచించుకుని నాలుగు రకాలుగా నాలుగుచోట్ల దాచుకోవాలి. మళ్లీ పెద్ద బ్యాంకరూ! అంతేకానీ ఆవాలు ముద్ద చేసి మూతెట్టి, 'టాక్సు పోయింది, వడ్డీ తగ్గిపోయింది' అని కడిక్కడిగి నాలుగు రూపాయలు నా చేతిలో పెడితే నా దగ్గరేవన్నా అక్షయపాత్ర వుందా? నేనేవన్నా కాశీ అన్నపూర్ణేశ్వరినా?'

'ఇంతకీ నీ బాధేవిటి?'

'నేనేం మీ సొమ్ము వృథా చెయ్యడం లేదు. వీధి కట్టి విస్తళ్లెయ్యడం లేదు. చేతికెముక లేకుండా దానధర్మాలు చెయ్యడం లేదు. ఇంక లెక్కలూ, పద్దులూ మాని అడిగినంతా ఇస్తేనే బండి నడిచేది. నాకూ బాధ్యత తెలుసు. మిమ్మల్నీ, మీ సంసారాన్నీ ముంచెయ్యను.'

కాసేపు మావారు ఏం మాట్లాడలేదు.

నేనూ గుక్క తిప్పుకున్నాను.

'సందోరాజా భవిష్యతి' ముందు ముందు రోజులు బాగుంటాయనే అనుకోవాలి కానీ రాబోయే ఇబ్బందుల్ని ఊహించుకుని వాటిని ఇప్పుడే అనుభవించి అలవాటు చేసుకోవాలా? అంటే వచ్చే కష్టమూ, తెచ్చుకునే కష్టమూ రెట్టింపు బాధ అనుభవిస్తున్నామన్న మాట. మరీ ఇంత దూరదృష్టి వుంటే ఇబ్బంది. 'కానున్నది కాకమానదని' కర్మ సిద్ధాంతం కళ్లజోడు తగిలించుకోండి. నిశ్చింత, మనశ్శాంతీ లేవండీ. మూడు వేలు డ్రా చేసి పట్రండి. నెలాఖరు వరకూ సరిపోతుంది. పెంద్రాళే ఎండెక్కకుండా వెళ్లొచ్చేస్తే భోంచేసి పడుకోవచ్చు.

'ఆ మూడు వేలూ తెచ్చేస్తే ఇంక ఎక్కౌంట్లో బేలన్సేం వుండదు.'

'ఏం ఫర్వాలేదు. మహానుభావుడు, ప్రాతః స్మరణీయుడు. త్యాగరాజస్వామి ఎంత విలువైన మాటన్నాడూ– 'ఇచ్చిన ధనములు వచ్చేదాకా చిచ్చు వేరె లేదూ...' అని. దాచుకుని ఇంత సుఖపడుతున్నాం. అనుభవించిందే మనది... లేవండి, లేవండి! ◆

## అయోధ్య-సయోధ్య

వ్యక్తి ధర్మము, కుటుంబ ధర్మము, సంఘ ధర్మము,
ధర్మత్రయాల త్రివేణీ సంగమమే రామకథ!
రామాయణం పురాణం కాదు, గీతం, ఇతిహాసము
ఇరువై నాలుగు వేల శ్లోకాల వాల్మీకి విరచితం రామకథ!
ఆదికావ్యం ఆరు కాండల రామాయణంలో
బాలకాండలో తాటకి సుబాహుల వధ
అరణ్యకాండలో ఖరదూషణాదుల వధ,
కిష్కింధకాండలో వాలి సుగ్రీవుల యుద్ధం
సుందరకాండలో మారుతితో రాక్షసుల యుద్ధం
యుద్ధకాండలో రామరావణుల యుద్ధం,
యుద్ధం పోరాటం లేని కాండ అయోధ్య కాండ!!
రామో విగ్రహవాన్‌ధర్మః
దశరథునికి ఆదర్శ పుత్రుడు, సీతకు ఆదర్శ భర్త
లక్ష్మణునికి ఆదర్శ సోదరుడు, సుగ్రీవునికి ఆదర్శ మిత్రుడు
వశిష్ఠునికి ఆదర్శ శిష్యుడు, హనుమకు ఆదర్శ గురువు
దశకంఠునికి ఆదర్శ శత్రువు, విభీషణునికి ఆదర్శ రక్షకుడు!
నేడు కలియుగాన కుగ్రామాల నుండి అగ్ర రాజ్యాల వరకు
ఉగ్రవాద తాటకి, సుబాహులు, ఖరదూషణాదులు,
మారీచ రావణాదుల అరాచక క్షుద్రశక్తుల విజృంభణలే!
మనలో ప్రతి ఒక్కరు జటాయువులై, సుగ్రీవులై
ఆంజనేయులై, విభీషణులై, రామలక్ష్మణులై విజృంభించి
అరికట్టాలి ఈ అరాచక క్షుద్రశక్తుల విజృంభణం!
మన మనసులో అసూయ మంధరను తరిమితే
అంతట రామమందిరములే యీ సయోధ్యే అయోధ్య!
ప్రతి నవమి 'శ్రీరామ నవమి' ప్రతి తిథి శుభ తిథే!

**–దుర్గమహంతి మోహనరావు**